# మాటిచ్చిన.. నీళ్లు తెచ్చిన


కమ్మర్‌పల్లిలో మంత్రికి బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

- 'భగీరథ' ఫలితాలకు నిదర్శనం ఉప్లూర్
- కాంగ్రెస్‌కు 11 సార్లు చాన్స్ ఇచ్చాం..
- మళ్లీ ఒక్క అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ అడగడం విడ్డూరం
- బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- కమ్మర్‌పల్లి మండలంలో ఎన్నికల ప్రచారం



మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి

కమ్మర్‌పల్లి, నవంబర్ 14 : 'గత ఎన్నికల సమయంలో సాగు నీటి ఇబ్బందుల కారణంగా ఉప్లూర్ రైతులు తనను కోపగించుకున్నారు..అప్పుడే ఉప్లూర్ బాల రాజేశుడి ఆలయం ఎదుట ప్రమాణం చేసి చెప్పాను..చెప్పిన విధంగా ఎస్సారెస్పీ వరద కాలువను..కాకతీయ కాలువను మూడు కాలాలు నిండుగా ఉంచుతూ రెండు పంటలకు సాగు నీటి సౌకర్యాన్ని శాశ్వతంగా కల్పించాను' అని బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. దీనిని రైతులు, ప్రజలు గుర్తించి తనను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.మంగళవారం సాయంత్రం ఆయన కమ్మర్‌పల్లి మండల కేంద్రంతోపాటు నాగాపూర్, ఉప్లూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు 11 సార్లు అవకాశం ఇచ్చినా ఏమి చేయ లేదన్నారు. మళ్లీ ఒక చాన్స్ ఇవ్వాలని కాంగ్రెస్ అడగడం విడ్డూరంగా ఉందన్నారు. మిషన్ భగీరథ ఫలితాలకు ఉప్లూర్ గ్రామం చక్కని నిదర్శనమని పేర్కొన్నారు. రూ.3 కోట్లతో మిషన్ భగీరథ కింద ఉప్లూర్ మహిళల తాగునీటి ఇబ్బందులు శాశ్వతంగా దూరం చేశామని చెప్పారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్, నాలుగు లైన్ల రోడ్డు అభివృద్ధికి తార్కాణమని పేర్కొన్నారు.మినీ స్టేడియం నిర్మించి యువత దశాబ్దాల కల నెరవేర్చినట్లు తెలిపారు. కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని, తనను మరో సారి గెలిపించాలని వేముల కోరారు.

## అభిమాన నేతకు.. ఆత్మీయ స్వాగతం



వర్ని/నుస్రుల్లాబాద్, నవంబర్ 14: ఎన్నికల ప్రచారంలో భాగంగా స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి మంగళవారం వర్ని మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా తమ అభిమాన నేతకు ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. యువకులు, బీఆర్ఎస్ శ్రేణులు పటాకులు కాలుస్తూ, మహిళలు మంగళహారతులతో వచ్చి పూలు జల్లుతూ సభాపతిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అన్ని వర్గాల ప్రజలతో స్పీకర్ మమేకమయ్యారు. తాను చేసిన అభివృద్ధిని చూపిస్తూ ఓట్లు అభ్యర్థించారు. డబ్బులు పట్టుకొని అహంకారంతో వస్తున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వర్ని మండలంలో ప్రచారానికి వెళ్తున్న స్పీకర్ వాహనాన్ని ఎన్నికల అధికారులు నస్రుల్లాబాద్ శివారులో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

## అప్పుడెట్లుండె.. ఇప్పుడెట్లుంది..


జక్రాన్‌పల్లి మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

జక్రాన్‌పల్లి, నవంబర్ 14 : తెలంగాణ ఏర్పడక ముందు నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం ఏవిధంగా ఉందో, ప్రస్తుతం ఎలా ఉందో ప్రజలు ఒకసారి ఆలోచించాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కోరారు. జక్రాన్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో రూరల్ ఎన్నికల ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్‌తో కలిసి మంగళవారం ప్రచారం నిర్వహించారు. గడపగడపకూ సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని, కారు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే మాయమాటలు నమ్మవద్దని సూచించారు.

మాక్లూర్ మండలం అమ్రాద్ గ్రామంలో ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మంగళవారం ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గజమాలతో సత్కరించారు. ఫైర్ గన్స్‌తో ప్రజలకు అభివాదం చేశారు. అభివృద్ధి, సంక్షేమంతో నియోజకవర్గం మరింత వెలగొందేందుకు బీఆర్ఎస్‌కు ఓటేయాలని కోరారు.
-మాక్లూర్



## సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 14 : సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంయుక్త సీఈవో సర్ఫరాజ్ అహ్మద్ సూచించారు. కలెక్టర్లతో మంగళవారం జూమ్ మీటింగ్ నిర్వహించి వెబ్ కాస్టింగ్, ఓటరు స్లిప్పుల పంపిణీ తదితర అంశాలపై సూచనలు చేశారు. వెబ్‌కాస్టింగ్ కోసం సరిపడా సిబ్బందిని నియమించాలని, ఐటీఐ, ఇంజినీరింగ్ కళాశాలలు తదితర సంస్థలకు చెందిన విద్యార్థుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ తప్పనిసరి చేయించాలని ఆదేశించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఓటరు జాబితాను అందించి, వారి నుంచి అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకోవాలన్నారు. పోలింగ్‌కు కొన్ని రోజుల ముందే ఓటర్లకు వారి ఓటు ఏ పోలింగ్‌స్టేషన్ పరిధిలో ఉందనే వివరాలను తెలిపే ఓటర్లు స్లిప్పులను పంపిణీ చేయించాలని సూచించారు. జూమ్ మీటింగ్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, ఎన్నికల విభాగం అధికారులు పవన్, సాత్విక్ పాల్గొన్నారు.


రాష్ట్ర ఎన్నికల జాయింట్ సీఈవో సర్ఫరాజ్ నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు




